క్లుప్తంగా

పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ



అంపిలిలో ఘటాలతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందుగా గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండలంలోని లుంబూరు, అట్టలి, ఎల్‌ఎల్ పురం, అంపిలి తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు అసిరితల్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. పాడిపంటలు బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండేలా దీవెనలు అందించాలని కోరుకుంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సాంప్రదాయ డప్పులు, మేళతాళాలతో, పులి వేషాలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు



సబ్‌స్టేషన్‌లో మెంటెనెన్స్ పనులు చేస్తున్న సిబ్బంది

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండ మండలాలకు అనుసంధానంగా ఉన్న నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మెంటెనెన్స్ పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, పిడుగులకు సబ్‌స్టేషన్‌లోని లింబ్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మర్మమత్తులకు గురయ్యాయి. దీంతో శ్రీకాకుళం నుంచి వచ్చిన ఎంఆర్‌టీ బృందం సబ్‌స్టేషన్‌లో కొత్త లింబ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేశారు. పాలకొండ ట్రాన్స్‌కో ఏడీఈ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ మెంటెనెన్స్ పనులు చేపట్టారు.

ఫార్మేటివ్-2 పరీక్షలు ప్రారంభం



గరుగుబిల్లి: పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు



గుమ్మలక్ష్మీపురం: రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మెటివ్-2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, గణితం పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 6 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు విద్యార్థులు ఏం నేర్చుకున్నారో పరీక్షించేందుకు, విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఎంఈఓ ఎస్.నాగభూషణరావు పరిశీలించారు. ఈ నెల 10వ తేదీలోగా పరీక్ష పత్రాలను వ్యాల్యుయేషన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మాస్టారుకు సత్కారం

వీరఘట్టం: రాంబాబు మాస్టారు ఉపాధ్యాయ వృత్తికే వన్నే తెచ్చారని విక్రంపురం గ్రామస్తులు కొనియాడారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రాంబాబు మాస్టారును మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాచర్ల మహేష్, మాజీ సర్పంచ్‌లు మాచర్ల వెంకటరమణ, నందీశ్వరరావు రాంబాబు మాస్టారు సేవలను కొనియాడారు.



రాంబాబు మాస్టారును సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

• ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గొట్టివలసలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోగులకు ఇంటి వద్దే ఉచితంగా వైద్య సేవలందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బీపీ, సుగర్, మలేరియా, టైఫాయిడ్, తదితర 11 రకాల పరీక్షలను శిబిరం వద్దే నిర్వహించి 15 నిమిషాల్లో రిపోర్టులను ఇవ్వడం జరుగుతుందన్నారు. తీవ్రమైన వ్యాధులతో బాధపడేవారికి కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. వారితో పాటు డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డి.భాస్కరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా ఎఫ్‌డీసీ నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజారోగ్య భద్రతకు పెద్దపీట: ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని జంపరకోట సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తమ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో అనేక మందికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించినట్లు గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలుచేస్తున్న జగనన్నను నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఆరిక వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, ఎంపీటీసీలు నిమ్మక దుర్గమ్మ, మజ్జి నవీన్‌కుమార్, పాండ్రంకి శ్రీను, గులివిందల రామచంద్రినాయుడ, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, వైద్యాధికారులు కె.చిరంజీవి, ఎస్.రవికుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు

భామిని: మండలంలోని బొడ్డగూడలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు సుమారు 325 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీఓ చంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా సతివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. అవసరమైన వారికి వైద్య శిబిరం టోకెన్లు అందించారు.

• కొమరాడ: మండలంలోని దళాయపీటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ జి.రాములు మంగళవారం ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు అరుణ్‌కుమార్, శ్రీధర్ తదితరులు రోగులకు వైద్య సేవలందించారు.

• గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసు గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

తహసీల్దార్ జే రాములమ్మ, ఈఓపీఆర్డీ జగదీష్‌కుమార్ పర్యవేక్షించారు. శిబిరం వద్ద భద్రగిరి ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చే వారికి సూపర్‌వైజర్ ఉనీష పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.



గుమ్మలక్ష్మీపురం: బాలేసులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



కొమరాడ: దళాయిపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్



భామిని: వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



భామిని: సతివాడలో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నగరపంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

• ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని 15,16 వార్డుల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందని, ఆ నిధులతో ప్రాధాన్యత ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే ఈ వార్డుల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం గటాలడెప్పివీధిలో రూ.9.65 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, వార్డు కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు, కడగల రమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు కిల్లారి మోహన్, కొండాడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, కె.విజయ్‌కుమార్, బాసూరు కాంతారావు, నీలాపు శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



15వ వార్డులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

నేడు కొండాపురంలో..

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 'గడపగడపక మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

• ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
• రూ.63 లక్షలతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉదయపురం పంచాయతీలోని జురుడుగూడ, దాసుగూడ, మల్లిగూడ, కంటుగూడ గిరిజన గ్రామాలకు ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.63 లక్షలతో సుమారు 7.50 కిలోమీటర్ల రహదార్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గిరిజన గ్రామాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను కేటాయించిందన్నారు. గత ప్రభుత్వాలు గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజన గూడలకు రహదారుల నిర్మాణంతో పాటు విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఎంపీటీసీ విద్యారాణి, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఫైనాన్స్ కార్పొరేషన డైరెక్టర్ ఇందిరాకుమారి, ఇంటికుప్పల రామకృష్ణ, రేవు సత్తిబాబు, బిడ్డిక అనంత్, షేక్ ఆదిల్, ఆకుల శ్రీధర్, రాయిపిల్లి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి



కొమరాడ: గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శరత్‌బాబు



గరుగుబిల్లి: ఉల్లిభద్ర గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ దివ్యలక్ష్మి

కొమరాడ: ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురంలో సర్పంచ్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామల్లో పరిశుభ్రత, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగుకాలువలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఉపాధిహామీ పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధి క్షేత్ర సహాయకుడు కె.గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఉల్లిభద్ర సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి అన్నారు. గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి యు.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను ముందస్తుగా రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వాహణకు అవసరమైన ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. అలాగే నాగూరులో సర్పంచ్ కేతిరెడ్డి శిరిష ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు.

బలిజిపేట పీహెచ్‌సీ పరిశీలన

బలిజిపేట: జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన బృందం బలిజిపేట పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ కేంద్రం వైద్యాధికారి నితిన్‌దత్ భరద్వాజ్, నిమిత్ ఎస్ కుబావత్‌లు పీహెచ్‌సీలో జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఏమేరకు అమలవుతున్నాయనేది గుర్తించారు. సిబ్బంది నైపుణ్యం తదితర అంశాలపై పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసూతిగది, ల్యాబ్, వార్డు ఫార్మసీ, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జరుగుతున్న తీరు మొదలైన వాటిని నిశితంగా పరిశీలించారు. సంబంధిత రికార్డులు, వైద్యసిబ్బందికి ఆరోగ్య కార్యక్రమాలపై ఉన్న నైపుణ్యం, పరిజ్ఞానం పరిశీలించారు. ప్రతిరోజూ నమోదవుతున్న ఓపీ, ఐపీ వివరాలను తెలుసుకున్నారు. ప్రసవాలు, నిర్ధారణ పరీక్షలు, మందుల వినియోగం వాటి నిర్వహణ రికార్డులు, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు బృందం తెలిపింది. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు, వైద్యాధికారిణి కిరణ్మయి, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏంపీడీఓ బాధ్యతల స్వీకరణ

సీతానగరం: సీతానగరం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ 6 నెలల శిక్షణ కోసం వెళ్లిన బి.కృష్ణ మహేష్ రెడ్డి మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందరికీ ఆరోగ్యభద్రత కల్పించడానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. అలాగే గ్రామాల్లో సచివాలయాల వారీగా వైద్య నిపుణులతో కూడిన వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తుందని, రోగులందరికీ ఇళ్లవద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు

సీతానగరం: రసాయన ఎరువు రహిత పంటలనే రైతులు పండించి ఆరోగ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఏపీసీఎన్‌ఎఫ్ ప్రతినిధి వై.శ్రీరాములు కోరారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠాపురంలో ఉపసర్పంచ్ ఆర్.రాము, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వై.గోపాలనాయుడు ఆధ్వర్యంలో ఏపీసీఎన్‌ఎఫ్ టీం సభ్యులు రైతులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను, సేంద్రియ ఎరువుల వినియోగంతో కలిగే లాభాలను రైతులకు వివరించారు.

ఉపాధి నిధులతో ప్రగతి బాటలు

పాలకొండ రూరల్: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి బాటలు వేసుకుందామని అట్టలి సర్పంచ్ కనుముల సంధ్యారాణి అన్నారు. గ్రామంలో మంగళవారం గ్రమసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఏడాది రూ.50 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేయటం జరిగిందన్నారు. అదే క్రమంలో ఈ ఏడాదిలో రూ.80 లక్షల అంచనాతో పలు అభివృద్ధి పనులను గుర్తించినట్లు చెప్పారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ పని కల్పించడంతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఉపాధి నిధులతో పూర్తిచేసేందుకు నిర్ణయించారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.కల్పన, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్య, దాము, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సంధ్యారాణి

పిచ్చిమొక్కల తొలగింపు

గరుగుబిల్లి: పార్వతీపురం-కురుపాం రహదారిలో ఖడ్గవలస జంక్షన్‌నుంచి తోటపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను ఎస్సై ఎం.రాజేష్ మంగళవారం జేసీబీ సాయంతో తొలగించారు. రహదారి మలుపులలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించినట్లు చెప్పారు.



జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

వ్యక్తి మృతి

గరుగుబిల్లి: గరుగుబిల్లి పంచాయతీ పరిధి హిక్కింవలసకు చెందిన జాగాన బలరాం నాయుడు (55) సకాలంలో వైద్యం అందక మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బలరాంనాయుడు మంగళవారం ఉదయం వరి పంటకు ఎరువు వేసి తిరిగి ఇంటికి వస్తుండగా స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అయితే పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు వైద్యులు గొట్టివలసలో జరిగిన జగనన్న ఆరోగ్య శిబిరానికి వెళ్లడంతో అక్కడ ఉన్న సిబ్బంది సరైన వైద్యం అందించక బలరాం నాయుడు ఆరోగ్య పరిస్థితి విషమించి కొద్ది సేపటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సకాలంలో సరైన వైద్యం అందిస్తే ఆయన బతికే వాడని అంటున్నారు.

గాంధీజీ జీవితం ఆదర్శం



గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ఆదర్శప్రాయమని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సహాధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కళాశాలలో గాంధీజీ జీవిత విశేషాలను తెలియజేస్తూ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.